## క్లుప్తంగా

### నేడు అవగాహన శిబిరం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక లక్ష్మీనగర్‌లో వెలసిన మాత రాజరాజేశ్వరి–షిర్డీ సాయిబాబ ఆలయ ప్రాంగణంలో ఆదివారం నైపుణ్య అభివృద్ధి, ఆరోగ్య అవగాహన శిబిరం ఉంటుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్కిల్ డెవలప్‌మెంట్ కోచ్ డా.చెన్నగోపి హాజరవుతారన్నారు. అలాగే ఆరోగ్య రక్షణకు వయోవృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

### నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

నవాబుపేట: మండలంలోని కారుకొండలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాలమహానాడు రాష్ట్ర నాయకుడు రమేశ్, కారుకొండ పత్తి నర్సింహులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌తో పాటు జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య హాజరవుతారని.. మండలంలోని దళిత సంఘాలతో పాటు యువజన సంఘాలు, అన్ని పార్టీల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### నర్సింహయ్యకు డాక్టరేట్



మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్యకు ఇంగ్లాండ్‌కు చెందిన గేమ్ బ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. 20 ఏళ్ల నుంచి నర్సింహయ్య చేస్తున్న సేవలను గుర్తించి.. శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు డా.రాహుల్ రాయ్, ప్రొ. పాలేవర్, జస్టిస్ ప్రకాష్‌చంద్ర బిశ్వాస్, డా.తిరుపేష్ కేఆర్ పాండే చేతులమీదుగా డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు.

### 'రైతుభరోసా' ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రైతుభరోసా పథకం ద్వారా రైతన్నలందరికీ పెట్టుబడి సాయం అందించాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయకర్త బిచ్చారెడ్డి శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉగాది పండుగకు రైతులందరికీ రైతుభరోసా ఇస్తామని చెప్పిన రేవంత్ సర్కారు.. కొందరికి మాత్రమే రైతుభరోసా ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు.

### విద్యతోనే ఉజ్వల భవిష్యత్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉత్తమంగా చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని శ్రీచైతన్య స్కూల్ ఏజీఎం భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా తరగతుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. అదే విధంగా ఐఎన్‌టీఎస్‌ఓలో ప్రతిభకనబరిచిన విద్యార్థికి గ్రాండ్ ప్రైస్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, కోఆర్డినేటర్స్ రఘుబాబు, మృదుల, ఇన్‌చార్జీలు ప్రియ, సునీత, రాణి, యాదలక్ష్మి పాల్గొన్నారు.

### కోడ్గల్‌లో వైద్యశిబిరం

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్ గ్రామంలో శనివారం జడ్చర్ల డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.మాధురి నేతృత్వంలో ఎంఎల్‌హెచ్‌పీ డా.సంతోషి భవాని గ్రామస్తులకు బీపీ, షుగర్‌తో పాటు గ్రూపింగ్, హెచ్‌బీ స్థాయిలు, ఇతర సాధారణ పరీక్షలు చేశారు.ఆరోగ్య కార్యకర్త శంకరమ్మ, గ్రామస్తులు సాయిరెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

### క్రమశిక్షణతో చదువుకోవాలి

రాజాపూర్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంఈఓ సుధాకర్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని శనివారం రాజాపూర్ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు యాదయ్య, శివకుమార్, నర్సింహులు పాల్గొన్నారు.





దేవరకద్ర ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో..



అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామంలో..



బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామంలో..



జిల్లా కేంద్రంలో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# జై బోలో హనుమాన్‌కీ..

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

దేవరకద్ర/జడ్చర్లటౌన్/సాక్షి నెట్‌వర్క్: రామలక్ష్మణ్ జానకీ ..జై బోలో హనుమాన్‌కీ.. పవనసుత హనుమాన్‌కీ.. జై బోలో హనుమాన్‌కీ అంటూ గ్రామాలన్నీ భజరంగబలి నామస్మరణతో మార్మోగాయి. జిల్లావ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతి వేడుకలు అంబరాన్నంటాయి. ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన శోభాయాత్ర కనులపండువగా సాగింది. జిల్లా కేంద్రంలో జరిగిన శోభాయాత్రలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, రవీందర్ రెడ్డి, నవకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.



జడ్చర్లలో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

➡ జడ్చర్ల పట్టణంతో పాటు గ్రామాల్లోని హనుమాన్ దేవాలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు ప్రారంభమయ్యాయి. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. హిందూ సంఘాల ఆధ్వర్యంలో సాయంత్రం నిర్వహించిన శోభాయాత్ర అలరించింది. నాగసాల ఆంజనేయస్వామి ఆలయంలో సీఐ కమలాకర్ పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించగా.. నిమ్మబావిగడ్డ ఆంజనేయస్వామి ఆలయం వద్ద బీజేపీ రాష్ట్ర నాయకుడు శాంతికుమార్‌తో పాటు స్థానిక నాయకులు పూజలు చేశారు. శోభాయాత్రను అదనపు ఎస్పీ రాములు పర్యవేక్షించారు.

➡ నవాబుపేట మండల కేంద్రంతో పాటు కొల్లూర్, ఇప్పటూర్, మరికల్, పోమాల్, లోకిరేవు, రుద్రారం, చాకలపల్లి, నీర్సాబ్‌తండా తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం భారీ హనుమాన్ విగ్రహాలతో శోభాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా యువకులు నృత్యాలతో హోరెత్తించారు.

➡ దేవరకద్రలోని ప్రసన్నాంజనేయస్వామి, రైల్వేస్టేషన్ ప్రాంతంలోని ఆంజనేయస్వామి, చిన్నరాజమూరు ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

➡ అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాలతో పాటు శాఖాపూర్, గుడిబండ, రాచాల, వేముల, పోల్కంపల్లి, జానంపేట, తిమ్మాపూర్ హనుమాన్ దేవాలయల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



మహమ్మదాబాద్ మండలం జూలపల్లిలో..



చిన్నచింతకుంటలో..

➡ మహమ్మదాబాద్ మండల కేంద్రంతో పాటు జూలపల్లి తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి భక్తులకు అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.

➡ రాజాపూర్, బాలానగర్ మండల కేంద్రాలతో పాటు తిర్మలాపూర్, మల్లేపల్లి, రాయపల్లి, ఉడిత్యాల, మోతిఘనపూర్, పెద్దరేవల్లి తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఉల్లి శరణయ్య, లక్ష్మీనారాయణగౌడ్, ప్రశాంత్‌చారి, నారాయణ, బచ్చిరెడ్డి, ఆనంద్, సూరిబాబుగౌడ్ పాల్గొన్నారు.

➡ గండేడ్ మండలంలోని వెన్నాచేడ్, కప్లాపూర్, మన్సూర్‌పల్లి, రెడ్డిపల్లి, కొంరెడ్డిపల్లి, గండేడ్ పెద్దవార్వాల్, సాలార్‌నగర్ తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు యువకులు కాషాయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు.



నవాబుపేటలో..

ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయాల్లో భజన కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నదానం చేశారు.

➡ చిన్నచింతకుంట మండల కేంద్రంతో పాటు ఉంద్యాల, తిర్మలాపురం, వడ్డేమాన్ గ్రామాల్లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు.

# కల్యాణం.. కమనీయం

● వైభవంగా శ్రీకపిలాద్రి రుక్మిణి పాండురంగస్వామి కల్యాణోత్సవం



శ్రీరుక్మిణి పాండురంగస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ధర్మాపూర్ కల్లంగుట్టపై వెలసిన శ్రీకపిలాద్రి రుక్మిణి పాండురంగస్వామి కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. వందలాది భక్తుల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణం కమనీయంగా సాగింది. ముందుగా సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసిన పల్లకీలో పాండురంగస్వామి, రుక్మిణి దేవతా మూర్తులను గర్భగుడి నుంచి పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాల నడుమ గుట్ట కింద నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలోకి తీసుకువచ్చారు. మామిడి తోరణాలు, వివిధ రకాల పూలు, శోభాయమానంగా అలంకరించిన కల్యాణ మండపంలో ప్రత్యేక పూజల అనంతరం జీలకర్ర బెల్లం, మంగళసూత్ర ధారణ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాల నడుమ జరిగిన ఈ పవిత్ర ఘట్టాన్ని చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. అనంతరం పాండురంగ స్వామి, రుక్మిణి దేవతామూర్తులకు పట్టువస్త్ర ధారణ, తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు. చాలా మంది దేవతామూర్తుల తలంబ్రాలను తీసుకెళ్లడానికి పోటీపడ్డారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు దేవస్థానం తరపున వారి చేతులకు పసుపుకొమ్ములను ధరింపజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో మళ్లీ గర్భగుడిలోకి తీసుకెళ్లారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నరసింహయ్య, జాతర ప్రచార కార్యదర్శి ఎంకిగారి అశోక్, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మేఘారెడ్డి, బానూరు శ్రీను, రాజుగౌడ్, గ్రామ పెద్దలు కర్రె బాల్‌రెడ్డి, బానూరు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం

జడ్చర్ల టౌన్: పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి.. పురోహితుల మంత్రోచ్ఛారణాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.




లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

## అందరిపై ఆంజనేయస్వామి కటాక్షం ఉండాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: అందరిపై ఆంజనేయస్వామి కటాక్షం ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక అప్పన్నపల్లి ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ముస్లింలు ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అదే విధంగా అంబభవాని ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు గుండా మనోహర్, శివశంకర్, రామాంజనేయులు, హరిబాబు, రామకృష్ణ, శేఖర్, బాండేకర్ విశ్వనాథ్, విజయ్‌కుమార్ పరాంకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను అందరూ కొనసాగించాలని పీయూ ప్రొఫెసర్ భూమయ్య అన్నారు. స్థానిక క్రిస్టియన్‌పల్లిలోని బాలుర కళాశాల హాస్టల్ ప్రాంగణంలో శనివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం' అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం రిజర్వేషన్లు తొలగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అన్ని రంగాలను ప్రవేటీకరిస్తూ రిజర్వేషన్ల విధానాన్ని తూట్లు పొడుస్తోందన్నారు. ఈడబ్ల్యూఎస్ కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎక్కువ మార్కులు వచ్చినా ఉద్యోగ అవకాశాలు లభించడం లేదన్నారు. రాజ్యాంగంలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం–లౌకికతత్వం వంటి వాటిని తొలగించాలని చూస్తోందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు యువత ముందుకురావాలని కోరారు. అంతకుముందు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ డా.కృష్ణమోహన్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లెల మాణిక్యం, కార్యదర్శి ఎం.కురుమయ్య, పీయూ ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు బత్తిని రాము, కేవీపీఎస్ నాయకులు మనోహర్, క్రాంతి, విల్సన్, ఎస్.సతీష్, రామ్‌రాజ్, శ్రీకాంత్, ఆకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీయూ ప్రొఫెసర్ భూమయ్య

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గండేడ్: మండలంలో విద్యుత్ లైన్ల కింద చెట్లకొమ్మల తొలగింపు, సబ్‌స్టేషన్ల మరమ్మతు దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీకాంత్ తెలిపారు. సల్కర్‌పేట, వెన్నాచేడ్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### వనజీవికి వృక్ష నివాళి




జడ్చర్ల టౌన్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో శనివారం వనజీవి పద్మశ్రీ రామయ్యకు వృక్ష నివాళి అర్పించారు. ఆయన స్మృతిచిహ్నంగా మొక్క నాటి రామయ్య పేరు పెట్టారు. కళాశాల, బొటానికల్ గార్డెన్‌కు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య గుర్తుచేశారు. బొటానికల్ గార్డెన్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వనజీవి రామయ్య దంపతులు హాజరైన విషయం పాఠకులకు తెలిసిందే. గార్డెన్ నిర్వహణను ఆయన ప్రశంసించారు. వనజీవి రామయ్య పేరిట గార్డెన్‌లో వ్యూపాయింట్ ఏర్పాటుచేశారు.

### శుభ్రత అందరి బాధ్యత



హన్వాడ: మండలంలోని చిన్నదర్పల్లిలో శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్–4 వలంటీర్లు పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దరిచేరవని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం శ్రమదానం చేసి పురవీధులను శుభ్రం చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఇమ్మానియేల్, అధ్యాపకులు కృష్ణుడు, లింగమయ్య, అశోక్ పాల్గొన్నారు.

### వైభవంగా బండ్రవల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు



చిన్నచింతకుంట: మండలంలోని బండ్రవల్లి ఊకచెట్టు వాగు సమీపంలో వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, హోమం, పంచామృత అభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పద్మావతి, అలివేలుమంగ సమేత శ్రీనివాసుడి కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం 280మంది దంపతులతో నిర్వహించిన యజ్ఞ కార్యక్రమాలతో గోవింద నామస్మరణతో మార్మోగింది. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

**దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు**

గండేడ్: మండలంలోని సాలార్‌నగర్‌లో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. గ్రామంలో అమృత లింగేశ్వర, గణపతి, నంది, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహ విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మూడు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజున శివానంద్ గురుస్వామి ఆధ్వర్యంలో అఖండ దీపారాధన, గణపతిపూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, దేవతా విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు.

## పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మహబూబ్‌నగర్ రూరల్/దేవరకద్ర: పోషకాహారంతోనే ప్రతిఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా అన్నారు. పోషణ పక్షోత్సవాలను పురస్కరించుకొని శనివారం మహబూబ్‌నగర్ అర్బన్ ప్రాజెక్టు షాషాబ్‌గుట్ట సెక్టార్ పరిధిలోని కమ్యూనిటీహాల్‌లో తల్లిపాల విశిష్టత, పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. రోజు తీసుకునే ఆహారంలో పాలు, పండ్లు, గుడ్లు, పప్పులు, ఆకుకూరలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఎండీ షబ్బీర్ అలీ, హెల్త్ సూపర్‌వైజర్ సుశీల, ఏఎన్‌ఎం శోభ తదితరులు పాల్గొన్నారు.



గర్భిణికి సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

➡ దేవరకద్రలోని కురుమవాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు.

## ముందుజాగ్రత్తలు పాటించాలి

నవాబుపేట: తీవ్రమైన ఎండలతో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు ముందుజాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు ఓఆర్‌ఎస్ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా మధ్యాహ్నం వేళ అత్యవసరమైతేనే బయటికి వెళ్లాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలతో వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున అన్ని గ్రామపంచాయతీల్లో ఓఆర్‌ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.



నవాబుపేటలో కూలీలకు ఓఆర్‌ఎస్ పాకెట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్

## మధ్యాహ్నమే మున్సిపల్ కార్యాలయానికి తాళం

రాజీవ్ యువవికాసం దరఖాస్తుల సమర్పణపై అయోమయం

జడ్చర్ల టౌన్: రెండవ శనివారం అయినప్పటికీ రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తులు సమరి్పంచేందుకు మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాలు తెరిచి ఉండాలి. అయితే జడ్చర్ల మున్సిపల్ కార్యాలయం మధ్యాహ్నం 2:30 గంటలకే మూసి వేయడంతో దరఖాస్తుదారులు అయోమయానికి గురయ్యారు. తమ ధ్రువపత్రాలు ఎవరికి ఇవ్వాలో తెలియక ఆందోళన వ్యక్తంచేశారు. రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 14వ తేదీ వరకు గడువు ఉంది. ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తు ఫారానికి సంబంధిత ధ్రువపత్రాలను జతపర్చి మున్సిపల్ కార్యాలయంలో సమరి్పంచాల్సి ఉంది. అయితే వరుసగా శని, ఆది, సోమవారాల్లో సెలవులు ఉన్నాయి. దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేయాల్సి ఉండగా.. మున్సిపల్ కార్యాలయానికి మధ్యాహ్నమే తాళం వేయడంపై దరఖాస్తుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డిని వివరణ కోరగా.. కార్యాలయానికి సెలవు ఉన్నప్పటికీ దరఖాస్తులు స్వీకరించేందుకు కౌంటర్ తెరిచి ఉంచామన్నారు. ఆది, సోమవారాల్లో సెలవుదినం అయినప్పటికీ దరఖాస్తులు ఇవ్వవచ్చని, కౌంటర్‌లో సిబ్బంది అందుబాటులో ఉంటారని వివరించారు.



మూతపడిన మున్సిపల్ కార్యాలయం

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మిడ్జిల్: మండలంలోని కంచన్‌పల్లి, వల్లభ్‌రావుపల్లి గ్రామాల్లో ఐకేపీ ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యాసంగిలో పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అల్వాల్‌రెడ్డి, సాయిలు, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.



కంచన్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

### చిన్నారి అప్పగింత

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై ఫిట్స్‌తో పడిపోయిన మహిళను ఆస్పత్రిలో చేర్పించడంతో పాటు సదరు మహిళ కూతురిని తనతో పాటు ఇంట్లో పెట్టుకుని మరుసటి రోజు పోలీసులకు అప్పగించి ఔదార్యం చాటుకుంది ఓ యువతి. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ వివరాల మేరకు.. ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలో ఓ గుర్తుతెలియని మహిళ ఫిట్స్‌తో పడిపోయింది. గమనించిన పర్వీన్‌బేగం అనే యువతి సదరు మహిళను జిల్లా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించింది. సదరు మహిళతో పాటు ఉన్న ఆరేళ్ల కూతురిని పర్వీన్‌బేగం సీతారాంపేటలోని తన ఇంటికి తీసుకువెళ్లింది. శనివారం పర్వీన్‌బేగం తన తండ్రితో కలిసి పాపను తీసుకుని జిల్లా కేంద్రానికి వచ్చింది. చిన్నారి చెప్పిన చిరునామా ప్రకారం ఆటో డ్రైవర్ సహాయంతో వీరన్నపేటలో గాలించి.. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో చిన్నారిని అప్పగించారు. ఔదార్యం చాటిన పర్వీన్‌బేగంతో పాటు ఆటో డ్రైవర్ యాదగిరిని డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు.